# బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక తనిఖీలు



భూపాలపల్లి జూన్ 17(వుదయం విలేకరి)బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు భూపాలపల్లి సీసీఎస్ సీఐ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇతర శాఖల అధికారులు కలిసి బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు వెల్లడించారు జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న భవనాలు, ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, మెకానిక్ షాపులు, స్క్రాప్ షాపులు, బేకరీలు తదితర ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికుల సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించి బాల కార్మిక నిర్మూలనకు తోడ్పడాలని సూచించారు.

# ఎరువులు పురుగు మందుల విక్రయ కేంద్రాల తనిఖీలు



మహాదేవపూర్ జూన్ 17(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండలంలో రాబోయే వానాకాలం-2026 సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే చర్యలలో భాగంగా విత్తన నియంత్రణ చట్టాల అమలులో భాగంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఎస్సై, సాంబమూర్తి డిప్యూటీ తహసీల్దార్ మొహమ్మద్ యూసుఫ్, ఆధ్వర్యంలో మహాదేవపూర్ గ్రామంలోని డీలర్ల షాపులను పరిశీలించారు. పత్తి విత్తనాల లభ్యత, ఎరువుల నిల్వలు, గ్లైఫోసేట్, పారాక్వాట్ గడ్డి మందుల నిల్వలు, లైసెన్సుల వివరాలు, కొనుగోలు రశీదులు, అమ్మకపు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ పట్టికలు, ధరల పట్టికలను పరిశీలించారు. అలాగే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు నిర్వహిం చాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.



# ఆర్థిక అక్షరాస్యత సదస్సు

ధర్మసాగర్ జూన్ 17 ( వుదయం ప్రతినిధి )
ఈరోజు ధర్మసాగర్ మండలం దేవుని గ్రామంలో
వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి ధర్మసాగర్ శాఖ ఆధ్వర్యంలో సాంకేతిక అక్షరాస్యత సధస్సు ను నిర్వహించారు, నాబార్డ్ వారి ఆదేశాల మేరకు గ్రామం దేవునూర్ లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సందర్భంగా డీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ, బ్యాంక్ అందిస్తున్న నూతన డిపాజిట్ పథకం రాణి రుద్రమ్మ డిపాజిట్ స్కీమ్ కింద అత్యధికంగా 8.10/: వడ్డీ చెల్లిస్తున్నారు. దీర్ఘకాళిక రుణాలు, బర్రెలు, గొర్రెలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు మరియు హోసింగ్ 4 ఎడ్యుకేషన్ లోన్లు, ఆన్లైన్ బ్యాంకింగ్ సేవలు యుపిఐ మొబైల్ బ్యాంకింగ్ మరియు లాకర్ సదుపాయలు కలదు అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమం లో డీసీసీ బ్యాంక్ మేనేజర్ ఆర్ వెంకటేష్ , డీసీసీ సూపర్ వైజర్ శ్రీనివాస్ రెడ్డి, దేవునూర్ గ్రామ సర్పంచ్ హింగే రవీందర్, ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు పిఎసిఎస్ ధర్మసాగర్ ఆఫీస్ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్ ,కలకోటి మురళీకృష్ణ, గ్రామ రైతులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు

- బాలాలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ





మహాదేవపూర్ జూన్ 17(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో వచ్చిన శిష్యబృందం, తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో పంచబ్రహ్మ హోమం, శాంతి పూజలు, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే విజయ గణపతి, పార్వతి (శుభానంద) మాత, మహా సరస్వతి మాత, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించి, పంచలోహ బింబాలలో ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామివారు బాలాలయ పూజల నిమిత్తం పంపించిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి చిన్న లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రులు, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ఐదుగురు అర్చకులు కళశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆదిముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాలాలయ మండపంలో శృంగేరి పీఠ శిష్యబృందం చేత ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్ సుందర్, సీతారాం,మంచినీళ్ల దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, సత్యం తదితరులను శృంగేరి పీఠం శిష్యబృందం సన్మానించి, ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# పెన్షన్ లబ్ధిదారుల పెన్షన్‌కు ఆధార్ కార్డ్ లింక్ చేయుటకు ఏర్పాట్లు

## సర్పంచ్ మోహన్ రెడ్డి

మహాదేవపూర్ జూన్ 17(వుదయం ప్రతినిధి)పెన్షన్ లబ్ధిదారుల పెన్షన్‌కు ఆధార్ కార్డ్ లింక్ చేయుటకు ఏర్పాట్లు చేసినట్లు కాళేశ్వరం గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులందరికీ వారి యొక్క పెన్షన్‌కు ఆధార్ కార్డ్ లింక్ చేయుటకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు నేటినుండి నుండి 21-06-2026 వరకు ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు లబ్ధిదారులందరూ తప్పనిసరిగా వచ్చి వారి ఆధార్ కార్డును వెంట తీసుకువచ్చి, నిర్ణీత సమయంలోగా పెన్షన్ కు ఆధార్ లింక్ చేయించుకోవాల్సిందిగా కోరారు లేనిచో లబ్ధిదారుల పెన్షన్ కట్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని పెన్షన్ దారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మల్యాల నూతన ఎస్ఐ గ సందీప్ బాధ్యతలు..



మల్యాల మండలం జూన్ 17 ( వుదయం ప్రతినిధి )జగిత్యాల జిల్లా మల్యాల మండలం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గ సందీప్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొడిమ్యాల పీస్ లో ఎస్ఐ గ పని చేసిన అయిన బదిలీపై మల్యాల కి వచ్చారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ...మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సమక్షంలో యువకుల చేరిక



మంథని, జూన్ 18 (వుదయం ప్రతినిధి):రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన యువకులు గడ్డం సంతోష్, గడ్డం వెంకటేష్‌తో పాటు పలువురు యువకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుందిల్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధుకర్ సమక్షంలో వారు పార్టీలో చేరగా, ఆయన వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు కొత్తగా చేరిన నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పుట్ట మధుకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంత అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంథని సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్ధ స్వామి

## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐ



పెద్దపల్లి, జూన్ 18 (వుదయం కరస్పాండెంట్ ):మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బుద్ధ స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మంథని సీఐగా విధులు నిర్వహించిన రాజు ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో బుద్ధ స్వామి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన సీఐ బుద్ధ స్వామి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి విధుల నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించినట్లు సమాచారం. మంథని సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తానని బుద్ధ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మంథని పోలీసు అధికారులు, సిబ్బంది నూతన సీఐకి ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ప్రజల సహకారంతో చట్టబద్ధమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా ప్రజాకవి రావికంటి రామయ్య గుప్త 90వ జయంతి వేడుకలు





మంథని, జూన్ 17: (వుదయం ప్రతినిధి)మంత్రకూట వేమనగా, ప్రజాకవిగా పేరొందిన రావికంటి రామయ్య గుప్త 90వ జయంతి వేడుకలు బుధవారం మంథనిలో ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ సహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శశిభూషణ్ కాచే, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొమురవెల్లి విజయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్, రావికంటి రామయ్య గుప్త తనయుడు, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఇటీవల ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కొమురవెల్లి విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, కవిత్వం, సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన రావికంటి రామయ్య కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. జిల్లా పెన్షనర్ల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రామడుగు మారుతి మాట్లాడుతూ, మంథని గడ్డ అనేక మంది మహనీయులకు జన్మనిచ్చిందని, వారి జయంతి, వర్ధంతులను నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రావికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ మహనీయుల చరిత్రను అక్షరబద్ధం చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు కొండేల మారుతి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా, కవిగా రావికంటి రామయ్య సమాజంపై చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆజీంఖాన్, రావికంటి సదానందం, మాడిశెట్టి సుదర్శన్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ఓబీసీ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల రాజేందర్....**

కరీంనగర్ జూన్ 17 (వుదయం ప్రతినిధి): మానకొండూరు నియోజకవర్గం లోని ఓబీసీ మోర్చా ప్రభారి మియాపూర్ లక్ష్మాచారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సందర్భంగా జనకల్యాణ్ పేరిట కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని అలాంటప్పుడే బీజేపీ బలపడుతుందని, పక్షం రోజులుగా చెట్లు నాటే కార్యక్రమం, ప్రకృతి వ్యవసాయ పరిశోధన వల్ల రైతులకు లాభాలు అనేకంశాలపై పనిచేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ ప్రభారి మియాపూర్ లక్ష్మణాచారి, మండల కన్వీనర్లు గోరిశెట్టి రమేష్, అంబటి స్వామి, వెంగల ప్రవీణ్ , నెట్టు అంజయ్య, బిజెపి నాయకులు దూలం కిరణ్, టంగుడు రాజ్ కుమార్, విష్ణువర్ధన్, నందగిరి బలరాం పుట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# మంథని మండలానికి రూ.2.55 కోట్ల నిధులు మంజూరు

## మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ కృతజ్ఞతలు



మంథని, జూన్ 18 (వుదయం ప్రతినిధి):మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద మంథని మండలంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 2.55 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ వేల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను తీసుకువస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పేద ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు, దుద్దిళ్ల శ్రీను బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గానికి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, ప్రజల తరఫున మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

జిల్లాల ప్రశాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



పెద్దపల్లి జూన్ 17 (వుదయం ప్రతినిధి)
ఈరోజు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజుల దందాను అరికట్టాలని జిల్లా ఐజూా గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ ఈరోజు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపబడుతోంది. ముఖ్యంగా స్కూల్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్‌లు మరియు ఇతర సానిటరీ ఐటమ్స్ వంటి వస్తువులను విద్యాసంస్థలే బలవంతంగా అమ్మిస్తూ అక్రమ వాణిజ్యానికి పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల వలన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది విద్యను వ్యాపారంగా మార్చే ప్రమాదకర పరిస్థితికి దారితీస్తోంది. కాబట్టి ప్రైవేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని స్కూల్స్ ద్వారా బలవంతంగా యూనిఫామ్స్, పుస్తకాలు మరియు ఇతర వస్తువుల విక్రయాన్ని నిలిపివేయాలని విద్యా హక్కు చట్టాన్ని (ఆర్టీఈ) పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకొని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంప నరేష్ మరియు సాయి చరణ్, అభివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న కంది మౌనా శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ ,జూన్ 17(వుదయం ప్రతినిధి) ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం తాంసి మండలం గొట్కూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు కుంటాల పూజ, విజయ్ దంపతుల నివాసాన్ని సందర్శించారు. రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. దంపతులకు శుబాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు..

## టీజీపల్లెలో రెబీస్ కలకలం - 2 గేదెలు మృతి, గ్రామస్తుల ఆందోళన



జన్నారం, జూన్ 17(వుదయం విలేకరి) మండలంలోని టీజీపల్లె గ్రామంలో రెబీస్ వ్యాధి కలకలం రేపుతోంది. వారం రోజుల క్రితం రెబీస్ సోకి ఒక కుక్క మృతి చెందగా, మృతదేహాన్ని తొలగించాలని గ్రామ సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృత కుక్కను పాతిపెట్టకపోవడంతో ఇతర కుక్కలు దానిని తిన్నాయని, అనంతరం అవి గ్రామంలోని గేదెలను నాకడంతో వ్యాధి వ్యాపించి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెబీస్ లక్షణాలతో బుధవారం రెండు గేదెలు మృతి చెందాయని సమాచారం. రైతు రవి మృత గేదెలను పాతిపెట్టారు. గ్రామంలో రెబీస్ వ్యాపిస్తుందనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఘటనపై పశుసంవర్ధక శాఖ అధికారులు,వైద్య సిబ్బంది వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఉద్యోగాల భర్తీపై బీఆర్ఎస్వీ ఆందోళన

### - 5 వేలు కాదు.. 20 వేల పోలీస్ పోస్టులు భర్తీ చేయాలి



ఆదిలాబాద్, ,జూన్ 17(వుదయం ప్రతినిధి)రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. కొమరం భీం ప్రాంగణంలో నిరుద్యోగ యువతతో కలిసి కరపత్రాలు ప్రదర్శించిన నాయకులు, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న పోలీస్ శాఖ పోస్టులను భర్తీ చేయకుండా కేవలం 5 వేల ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకే పరిమితం కావడం సరైన విధానం కాదన్నారు. ఖాళీగా ఉన్న 20 వేల పోలీస్ పోస్టులను దశలవారీగా కాకుండా పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీని వెంటనే అమలు చేసి, సంబంధిత శాఖల్లో ఖాళీలకు నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. నిరుద్యోగ యువత ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, లక్కారం వార్డు సభ్యుడు అజ్మీరా జయచంద్ర, దూట మహేందర్, గిరి నాయక్, సాధని సురేష్, రాథోడ్ అన్వేష్, కమేరి రాజు, బొడ్డు నరేష్, సాజిద్, సిద్ధిక్, దినేష్‌తో పాటు పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల/జూన్ 17(వుదయం ప్రతినిధి) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్మాణ పనులు నిర్వహించాలని, నిర్మాణ సామగ్రి నాణ్యత, భద్రతా ప్రమాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న వసతులు, విద్యా సదుపాయాలు, భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల కూడా శ్రద్ధ చూపాలని సూచించారు.

పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదు, అకడమిక్ రికార్డులు, ఇతర పరిపాలన రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల అభ్యాస స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, నాణ్యమైన బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులు, వసతి గదులు, ఇతర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థినుల సంక్షేమం, భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, గుత్తేదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జీసీసీ ద్వారా రికార్డు స్థాయిలో జొన్నల కొనుగోలు

### డీఎం సందీప్ కుమార్‌కు కలెక్టర్ సత్కారం

ఆదిలాబాద్ ,జూన్ 17(వుదయం ప్రతినిధి) గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా 10 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4,207 మంది రైతుల నుండి 1,20,000 క్వింటాళ్ల జొన్నలను విజయవంతంగా కొనుగోలు చేసినందుకు గాను ఉట్నూర్ జీసీసీ డీఎం గుడిమల్ల సందీప్ కుమార్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయవంతమైన కొనుగోలు ప్రక్రియకు సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, మార్క్‌ఫెడ్ డీఎంలకు డీఎం సందీప్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినందుకు అధికారులు కృషి చేసినట్లు కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## కుమ్మర సంఘం రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడిగా కోడూరి చంద్రయ్య



జన్నారం,జూన్17(వుదయం విలేకరి)తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడిగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జిగా జన్నారం మండల కేంద్రానికి చెందిన కోడూరి చంద్రయ్యను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడూరి చంద్రయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడుగా నియమించినందుకు అధ్యక్షుడు ఆకారపు మోహన్, రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి, కో కన్వీనర్ అమరాబాదే సారంగపాణి మరియు రాష్ట్ర కమిటీ సభ్యులకు రుణపడి ఉంటానని, త్వరలోనే గ్రామ కమిటీలు, మండల కమిటీలు కూడా ఏర్పాటు చేస్తానని అన్నారు. కుమ్మరుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

# మైసంపేట రాంపూర్ భూ వివాదంపై చర్యలు తీసుకోవాలి

### - ఐటీడీఏ పీవోకు రాజ్‌గోండ్ సేవాసమితి వినతి



ఆదిలాబాద్ ( వుదయం ప్రతినిధి ) నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాల ఆదివాసుల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని రాజ్‌గోండ్ సేవాసమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మాజీ ఎంపీ, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ఆధ్వర్యంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నారని, మహిళలపై కూడా దాడులకు పాల్పడ్డారన్న ఆరోపణలు చేశారు. మైసంపేట ఘర్షణ నేపథ్యంలో ఆదివాసులను అరెస్టు చేసి వారి వివరాలు వెల్లడించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు ఎత్తివేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

అటవీ భూముల పేరుతో దీర్ఘకాలంగా సాగు చేస్తున్న ఆదివాసులపై చర్యలు తీసుకోవడం సరైంది కాదని, గ్రామాలను తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గతంలోనూ టైగర్ జోన్ పేరుతో గ్రామాల తరలింపు ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు.

వినతిపై స్పందించిన ఐటీడీఏ పీవో మంద మకరంద సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

## కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )

పెంచికల్పేట్ మరియు దహేగాం మండలాల్లోని రైతు వేదికల వద్ద ఈ రోజు దహేగాం మండలానికి చెందిన 83 మంది మరియు పెంచికల్ పేట మండలానికి చెందిన 40 మందికి కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను ఆడపిల్లల పెళ్లి కోసం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెంచికల్పేట్ ఎమ్మార్వో రవీందర్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, దహేగాం ఎమ్మార్వో షరీఫ్, సర్పంచులు భక్తు రామచందర్, చప్పిడి రవీందర్, పొట్టే ఉమ మహేష్, అన్నం రుక్మాబాయి, బొట్టుపల్లి కృష్ణవేణి హరీష్, రాపర్తి జయ లక్ష్మీ, భాజపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన వేగవంతానికి ఆధునిక పరికరాల పంపిణీ

### కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ :జనగణన ప్రక్రియను పారదర్శకంగా, డిజిటల్ పద్ధతిలో వేగవంతంగా పూర్తి చేయడంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు అధునాతన కంప్యూటర్లు, ప్రింటర్లను అందజేశారు. జనగణన పనుల్లో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ డేటా నమోదు, నివేదికల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఆయా మండల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల బీభత్సం ఇటుక పడి మహిళ దుర్మరణం

- ధర్మపురి మండలంలో విషాదం
- మెట్లపై కూర్చుని మాట్లాడు తుండగా ప్రమాదం
- అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన మహిళ





ధర్మపురి,జూన్ 17 (వుదయం ప్రతినిధి ):మండల కేంద్రంలో విషాదకర ఘటన చోటచేసుకుంది. కోతుల గుంపు చేసిన అల్లరి ఓ మహిళ ప్రాణాలను బలితీసు కుంది. ప్రమాదవశాత్తు భవ నం పైనుంచి ఇటుక తలపై పడటంతో ఓ కూలి మహిళ అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం కమలాపూర్ ఇందిరమ్మ ప్లాట్లకు చెందిన కొనపర్తి పద్మ (55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది.

రోజువారీ అలవా టులో భాగంగా బుధవారం సాయంత్రం సుమారు 5:30 గంటల ప్రాంతంలో ఆమె తన పొరుగున ఉండే రూపు లక్ష్మితో కలిసి ఇంటి ముందున్న బిల్డింగ్ మెట్లపై కూర్చొని మాట్లాడుతోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఐదారు కోతుల గుంపు అక్కడికి వచ్చి,ఆ బిల్డింగ్ రేకులపై ఎగిరిపోకుం డా బరువు కోసం ఉంచిన ఇటుకలను కదిలించాయి.

కోతులు పైనుంచి ఇటుకను కిందకు నెట్టేయడంతో అది కాస్తా కింద మెట్లపై కూర్చుని ఉన్న పద్మ తలపై బలంగా పడింది. తీవ్ర రక్తస్రావం కావ డంతో పద్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కళ్లముం దే తోటి మహిళ మృతి చెంద డంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతురాలి భర్త కొనపర్తి సత్యనారాయణ ఇ చ్చిన ఫిర్యాదు మేరకు ధర్మ పురి పోలీసులు కేసు నమో దు చేశారు. ఘటనపై సబ్ ఇన్స్పెక్టర్ జి. మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పద్మ మృతితో ఇందిరమ్మ కాలనీ లో విషాద ఛాయలు అలము కున్నాయి. కోతుల బెడదపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# లిప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు




దమ్మపేట , జూన్ 17:(వుదయం ప్రతినిధి ): వార్డుల్లో ఉన్న సమస్యలను తోటి వార్డు సభ్యులతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని దమ్మపేట ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 4, 6, 7 వార్డులలో రోడ్లపై గుంతలలో మట్టి పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

ఈ గుంతలు వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి వేళల్లో వాహనదారులు గుంతలు గమనించకుండా వాహనాలు నడిపే వారికి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాం అన్నారు, వీధుల్లో ఇరువైపులా చెత్తను, పిచ్చి మొక్కలను సిబ్బంది తో శుభ్రం చేయించారు. పెన్షన్ అప్లికేషన్ లను ప్రజల వద్దకే వచ్చి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, సిబ్బంది పగడాల గోపి తదితరులు ఉన్నారు.

# సోలార్ ప్లాంట్ పెట్టండి... లాభాలు ఆర్జించండి

### నాబార్డు ద్వారా రుణం పొందండి

### సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు



కరీంనగర్ జూన్17 (వుదయం ప్రతినిధి):సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. ఈరోజు చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ధ్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి. వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలసదన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

## –జిల్లా సంక్షేమ అధికారి( ఇంచార్జ్) కాళిందిని

**అనాథలు, విడిచిపెట్టబడిన, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న బాలికలకు అవకాశం6 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలు ప్రవేశానికి అర్హులు**

పెద్దపల్లి, జూన్–17 (వుదయం ప్రతినిధి) మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో శ్రీ రామ టాకీస్ సమీపంలో నిర్వహిస్తున్న బాలసదన్ (చిల్డ్రెన్ హోమ్ ఫర్ గర్ల్స్) లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ( ఇంచార్జ్) జిల్లా సంక్షేమ అధికారి కాళిందిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అనాథలు, విడిచిపెట్టబడిన వారు , క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న 6 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలు ప్రవేశానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులు, సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 6300398362 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్‌లో కార్యకర్తల ఆవేదన స్వార్థ రాజకీయాలతో పార్టీకినష్టం



చర్ల, జూన్ 17(వుదయం ప్రతినిధి) చర్ల మండల కాంగ్రెస్ పార్టీ లో వర్గ విభేదాలు వల్ల సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు ఫార్టీ గడ్డుకాలంలో ఫార్టీ కి సేవలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగే పరిణామాలకు విసిగి వేసారి పోయారు.
కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి త్యాగాలు అంకితభావంతోనే పార్టీ బలపడుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేదురి సత్యనారాయణ పేర్కొన్నారు. అయితే ఇటీవల పార్టీ సిద్ధాంతాలు, కార్యకర్తల కష్టాలు, ప్రజల ఆకాంక్షలను పక్కనబెట్టి కొందరు నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
చర్ల మండలంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోస్తూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు అండగా నిలిచిన సీనియర్ నాయకులను పక్కన పెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారితో కలిసి కొందరు నాయకులు వర్గ రాజకీయాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ సంప్రదాయాలకు, విలువలకు విరుద్ధమని అన్నారు.పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల పంపకాల్లో కూడా అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అసలైన కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ మారి వచ్చిన వారికి గౌరవం ఇవ్వడం తప్పు కాదని, కానీ పదవులు మాత్రం పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారికే దక్కాలని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో పార్టీ విజయాల కోసం రాత్రింబవళ్లు శ్రమించిన కార్యకర్తలకు కనీస గుర్తింపు లేకపోవడం, గౌరవం దక్కకపోవడం బాధాకరమని వాపోయారు . కొందరు నాయకుల స్వార్థపూరిత వైఖరి కారణంగా కార్యకర్తలు అవమానాలు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితి కొనసాగితే పార్టీ బలోపేతానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని హెచ్చరించారు. కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్న నేదురి సత్యనారాయణ, పార్టీని బలోపేతం చేయాలంటే ముందుగా కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడాలని సూచించారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే నాయకులపై పార్టీ అధిష్టానం వెంటనే దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "కార్యకర్తలను గౌరవించినప్పుడే కాంగ్రెస్ బలోపేతం అవుతుంది. లేకపోతే పార్టీకి కోలుకోలేని నష్టం తప్పదు" అని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు చర్ల మండల కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ఆర్.కొత్తగూడెంలో ఉచిత దంత వైద్య శిబిరం





చర్ల, జూన్ 17(వుదయం ప్రతినిధి)
చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని చర్ల ఎంపీడీవో ఈదయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్.పెద్దాడ. గీతానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా దంత పరీక్షలు చేసి, అవసరమైన వైద్య సూచనలు అందజేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుర్రం రవికుమార్ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు. దంత ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నోటి పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక దంత సమస్యలను నివారించవచ్చని వైద్యులు వివరించారు.ఈ శిబిరంలో సుమారు 80 మంది గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి, వివిధ దంత సమస్యలకు తగిన పరిష్కారాలు, చికిత్సా సూచనలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో చర్ల ఉపసర్పంచ్ కాపుల కృష్ణ, ఆత్మ కమిటీ అధ్యక్షులు ఇందల బుచ్చిబాబు, కుదునూరు బీజేపీ నాయకులు శ్రీధర్, రాంచందర్‌రావు, గోసుల మనోజ్ కుమార్, అనుస్వాతి, కోరం రేణుక తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తూ మన్ననలు పొందాలి

## ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట జూన్: 17 వుదయం ప్రతినిధివినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తూ వారి మన్ననలను పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎల్‌ఎం లోన్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న నిపుణులు ఈ కన్సల్టెన్సీ ద్వారా ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా మంది రుణాల కోసం బ్యాంకులను సంప్రదించే సమయంలో ఏ బ్యాంకులో ఏ రకమైన రుణాలు లభిస్తాయి, వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి, నెలవారీ ఈఎంఐలు ఎంత వరకు ఉంటాయి వంటి అంశాలపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.కొన్నిసార్లు సరైన సమాచారం లేకపోవడం వల్ల రుణాల మంజూరులో జాప్యం లేదా తిరస్కరణ వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు సరైన బ్యాంకులను ఎంపిక చేసుకోవడం, అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవడం, గృహ, వ్యాపార, వ్యక్తిగత తదితర రుణాలపై పూర్తి సమాచారం పొందడం కోసం వైఎల్‌ఎం కన్సల్టెన్సీ వారధిగా పనిచేయనుందని చెప్పారు.ఎల్లమ్మ దేవత ఆశీస్సులతో ప్రారంభమైన ఈ కన్సల్టెన్సీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, కాంగ్రెస్ నాయకులు రెబెల్ శీను, ఆలేటి మాణిక్యం, భార్గవ్, సతీష్, ఉప్పలయ్య, నిర్వాహకులు కట్ట ప్రవీణ్ రెడ్డి, పోలేపాక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 19న సూర్యాపేటలో యోగా అవగాహన ర్యాలీ

## ఉ. 6 గం.కు ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం వద్ద ప్రారంభం



సూర్యాపేట జూన్:17వుదయం ప్రతినిధి
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 19 శుక్రవారం ఉదయం 6 గంటలకు సూర్యాపేట ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి యోగా అవగాహన ర్యాలీ ప్రారంభమవుతుందని ఉన్నత యోగా శిక్షణ కేంద్రం నిర్వాహకులు, యోగ గురూజీ చాడ పాపిరెడ్డి తెలిపారు.ప్రధాని మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ర్యాలీలు జరుగుతున్నాయని, యోగా సాధకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 21న బ్రాహ్మణ కళ్యాణ మండపంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి, గోరెంట్ల శ్రీనివాస్, నల్లెడ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సారపాకలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

## పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం -- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి) ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 34 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకాల చెక్కులు, అలాగే 25 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరట లభించిందని తెలిపారు. ఈ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొడి వరి సాగుతో ఖర్చు తగ్గింపు



చర్ల, జూన్ 17:(వుదయం ప్రతినిధి) వ్యవసాయ రంగంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, నీటి కొరత వంటి సవాళ్లను అధిగమించేందుకు రైతులు సంప్రదాయ పద్ధతుల నుంచి ఆధునిక సాగు విధానాల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) భద్రాద్రి కొత్తగూడెం శాస్త్రవేత్తలు సూచించారు. ఈ నేపథ్యంలో చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో నేరుగా వరి వెదజల్లు (డైరెక్ట్ సీడెడ్ రైస్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వరిని నారుమడి ద్వారా నాటే సంప్రదాయ పద్ధతితో పోలిస్తే పొడి విధానంలో నేరుగా విత్తనాలు వెదజల్లడం ద్వారా కూలీల ఖర్చు , నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో నీటి లభ్యత తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పద్ధతి రైతులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు .రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని, భూమిలో ఉన్న పోషకాల ఆధారంగా మాత్రమే ఎరువుల వినియోగం చేపట్టాలని డాక్టర్. భరత్ సూచించారు. అధిక దిగుబడుల ఆశతో అవసరానికి మించి ఎరువులు వాడటం వల్ల భూసారం క్షీణించి, భవిష్యత్‌లో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట ఉత్పాదకతతో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరించారు.మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న వరి రకాలైన డబ్ల్యూజీఎల్–44 (సిద్ధి), కేఎన్‌ఎం–1638 వంటి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ రకాలు అధిక దిగుబడులు ఇవ్వడమే కాకుండా మార్కెట్‌లో మంచి ధరను కూడా అందిస్తాయని తెలిపారు.ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ రైతులకు కేవీకే ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఆధునిక సాగు సాంకేతికతలు, వాతావరణ సమాచార సేవలు, చీడపీడల నివారణ, పంటల యాజమాన్యంపై శిక్షణలు నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. రైతులు కేవలం వరి పంటకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్, మునగ, పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగు చేపట్టి పంట మార్పిడి విధానాన్ని అనుసరిస్తే స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పడతాయని సూచించారు. అనంతరం రైతు సోయం అరవింద్ పొలంలో సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి విత్తనాలను వెదజల్లే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది . ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, ఏఈవోలు అఫ్రిద్, రామకృష్ణ, మైరాడా అగ్రోనమిస్ట్ షణ్ముఖ సాయి, మహిళా సోషల్ మొబిలైజర్ నవీన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ మాటతో అంగన్వాడి బడిబాటకు శ్రీకారం

## చర్ల ప్రాజెక్టు పరిధిలో అవగాహన ర్యాలీలు

చర్ల, జూన్ 17(వుదయం ప్రతినిధి) చర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుదునూరు, రాలాపురం అంగన్వాడీ కేంద్రాలలో "అమ్మ మాట -- అంగన్వాడి బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్య, పోషకాహారం, అంగన్వాడీ సేవల ప్రాముఖ్యతపై తల్లితండ్రుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు .కుదునూరు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.హెచ్.ఆర్. (టేక్ హోమ్ రేషన్) లబ్ధిదారులైన పిల్లలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో రేవతి మాట్లాడుతూ, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆదిలక్ష్మి, గ్రామస్తులు, తల్లులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.అదే విధంగా రాలాపురం అంగన్వాడీ కేంద్రంలో కూడా అమ్మ మాట -- అంగన్వాడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని యువత, తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సూపర్వైజర్ స్వరూపరాణి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జరీన బేగం, అంగన్వాడీ టీచర్ మడకం లక్ష్మి, గొంది త్రివేణి తదితరులు పాల్గొన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, చిన్నారుల నమోదు పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

# ఆపదలో స్నేహితునికి అండగా నిలిచిన బాల్యమిత్రులు

## రాజు కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10,000 ఆర్థిక సహాయం





పర్వతగిరి , జూన్ 17 ( వుదయం ప్రతినిధి ) :వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఎల్దండ రాజు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద సమయంలో బాల్యమిత్రులు రాజును పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.అలాగే, రాజు కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అధైర్యపడవద్దని, భవిష్యత్తులో కూడా తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జుట్టుకొండ మధుకర్, వడ్డే దేవేందర్, డెక్క రవిచందర్, బైరి అశోక్, పట్టాపురం రాజ్‌కుమార్, చింతకాయల సురేష్, చదల రాజు, మాచర్ల అనిల్‌కుమార్, మహమ్మద్ రఫీ, రావుల రాజు, అలుగులూరి రాజు, తంద్ర భాస్కర్, వల్లందాస్ రంగయ్య, వల్లందాస్ రమేష్, నరుకుడు రజిత, కవిత, అనిత, సరస్వతి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్.. అంకిత్

## ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోరం కనకయ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి) రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను సులభంగా బుక్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసార సాంద్రత తగ్గిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో మరింత ఎరువులు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.
జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొక్కజొన్న సాగు జరిగిందని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టేకులపల్లి మండలంలో ఐదు రైతు వేదికల ద్వారా యూరియాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ 1800 123 7157 సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గత సీజన్‌లో రికార్డు స్థాయిలో మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నష్టాన్ని భరించి అండగా నిలిచిందన్నారు. అయినప్పటికీ కొందరు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ కూడా అందులో భాగమేనని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా యూరియా బస్తాలను పంపిణీ చేశారు.
టేకులపల్లి పర్యటనలో భాగంగా ఏ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. లబ్ధిదారులు ధారావత్ చుక్కి, టిక్లీ దంపతులు నిర్మిస్తున్న ఇంటిని సందర్శించి పనుల పురోగతి, నిధుల విడుదల తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కినేని సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ బోడ బాలు, కొత్తగూడెం ఆర్‌డీఓ మధు, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దేవాలయ పరిసరాల్లో మద్యం విక్రయాలపై భక్తుల ఆందోళన

- పుణ్యక్షేత్ర పవిత్రతకు మద్యం విక్రయాలు ముప్పా?
- దేవస్థానం పరిసరాల్లో మద్యం బెల్ట్ షాపుల జోరు అధికారులు ఎందుకు మౌనం..?
- సిండికేట్ వ్యవస్థతో మద్యం బెల్ట్ షాపులకు ప్రోత్సాహం..




భద్రాచలం జూన్ 17 (వుదయం ప్రతినిధి):ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానిక ప్రజలు, భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన భద్రాచలం పట్టణంలో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయానికి వచ్చే వేలాది మంది భక్తులు, మహిళలు, చిన్నారులు సంచరించే ప్రాంతాల్లోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారులు, కాలనీలు, గల్లీల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

స్థానికంగా కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ కారణంగా అక్రమ విక్రయాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా పుణ్యక్షేత్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం పరిసర ప్రాంతాలను మద్యం రహిత మండలంగా ప్రకటించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, ఎక్సైజ్ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భద్రాద్రి వంటి పవిత్ర క్షేత్రంలో మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

"పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడటం అందరి బాధ్యత. అక్రమ మద్యం విక్రయాలపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి" అని భక్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భద్రాచలం ఎక్సైజ్ అధికారిఎస్.కె. రహీమున్నీసా బేగం వివరణ చరవాణిలో కోరగా...

భద్రాచలం పుణ్యక్షేత్ర ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి మద్యం బెల్ట్ దుకాణాల నిర్వహణ లేదు ఏవైనా ఉంటే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. భద్రాచలం పట్టణంలో ఎలాంటి మద్యం సిండికేట్ వ్యవస్థ లేదు భద్రాచలం పట్టణంలో 5 మద్యం దుకాణాలు మాత్రమే ఉన్నాయి. అంతకుమించి ఎలాంటి మద్యం సిండికేట్ వ్యవస్థ లేదు ఏవైనా ఉన్నట్టు తమ దృష్టికి తీసుకెళ్తే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలపై విశ్వాసానికి నిదర్శనం



చర్ల, జూన్ 17:(వుదయం ప్రతినిధి) ప్రస్తుత కాలంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోపరాజు తన కుమార్తె లహరి ని ఆర్. కొత్తగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో చేర్పించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల బోధనపై తనకు ఉన్న విశ్వాసంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గోపరాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు ఇది ఒక మంచి సందేశమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్న తరుణంలో, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన సొంత కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని చాటుతోందని మండల ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు గోపరాజు నిర్ణయాన్ని అభినందిస్తూ, మరింత మంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకునేలా ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ విద్యారంగం బలోపేతంగా,




**పేద విద్యార్థులకు మేలు జరిగేలా ఉండాలి:పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు.**

మధిర జూన్ 17, వుదయం ప్రతినిధి: పిఆర్ టియు మధిర మండల శాఖ ఆధ్వర్యంలో 2026 సంఘ సభ్యత్వ జనరల్ ఫండ్ క్యాంపెయిన్ ను చేపట్టినట్లు మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ పేర్కొన్నారు. మండలంలో చిలుకూరు ఖమ్మంపాడు దెందుకూరు ఇల్లూరు మడుపల్లి మహదేవపురం, మధిర టౌన్ పాఠశాలలు తదితర పాఠశాలల్లో మొదటిరోజు క్యాంపెయిన్ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్ లో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దానిలో భాగంగానే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు,తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు పాఠశాలల కుదింపు వంటి కార్యక్రమాలతో ముందుకు పోతుందని

అయితే ప్రభుత్వం చేపట్టే విద్యాసంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న లక్షలాదిమంది విద్యార్థులకు మేలు చేకూరేలా ఉండాలని

ప్రభుత్వం తీసుకుంటున్న విద్యా సంస్కరణలలో మేధావులు, విద్యావేత్తలు,ఉపాధ్యాయ సంఘ నాయకుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఉపాధ్యాయులంతా వేసవి సెలవుల్లో బడిబాటలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. వేసవిలో సెన్సెస్ డ్యూటీ లో పాల్గొని విజయవంతం చేసిన ఉపాధ్యాయులందరికి జిల్లాశాఖ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. క్యాంపెయిన్ లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు సి హెచ్ వి రవికుమార్ రాష్ట్ర బాధ్యులు డి వెంకటేశ్వరరావు మదార్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్ నాయకులు కొలగాని ప్రసాదరావు, తెల్ల మేకల శ్రీనివాసరావు,ఎల్ అప్పారావు టి.అజయ్ కుమార్, ఏం నాగేశ్వరరావు, మేడిశెట్టి కృష్ణారావు, రుద్రపోగు శ్రీనివాస్, మహ్మద్ చిన్న వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిబిడాగ్ రోలెక్స్ తనిఖీలు

## – ఎస్ఐ హనుమా నాయక్.




చిలుకూరు జూన్17 ( వుదయం )జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది బుధవారం మండల పరిధిలోని గ్లోబస్ ,గెట్ ఇంజనీరింగ్ కాలేజీలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ తో విస్తృత తనిఖీలు నిర్వహించాము అని ఎస్ఐ హనుమా నాయక్ తెలిపారు. డ్రగ్స్ గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన విద్యావ్యవస్థని, యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో కళాశాల నిర్వహకులు బాదే.లింగయ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలంలో రూ.4.29 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**వాహన తనిఖీల్లో 8.580 కిలోల ఎండు గంజాయి పట్టివేత**
**ఒకరు అరెస్ట్.. ప్రధాన నిందితుడు పరారీలో**
**భద్రాచలాన్ని గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతాం : డీఎస్పీ**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి)భద్రాచలం పట్టణంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం భద్రాచలం పట్టణ ఎస్ఐ పి. శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కూనవరం రోడ్డులోనిహా సుప్రియ (హెచ్‌పీ) పెట్రోల్ బంక్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన పల్సర్ మోటార్ సైకిల్‌ను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, వెనుక కూర్చున్న వ్యక్తి లగేజ్ బ్యాగ్‌తో దిగిన వెంటనే వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా నాలుగు ప్యాకెట్లలో మొత్తం 8.580 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.అరెస్టు చేసిన నిందితుడిని పర్సిక నాగేశ్వరరావు (45), సుందరయ్య నగర్ కాలనీ, భద్రాచలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.విచారణలో భాగంగా ఈ గంజాయిని ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైంది. కేసులో ప్రధాన నిందితుడు మరియు కొనుగోలుదారు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కేసును భద్రాచలం పట్టణ సబ్‌ఇన్‌స్పెక్టర్ వి. సతీష్ నమోదు చేయగా, దుమ్ముగూడెం ఇన్‌స్పెక్టర్, భద్రాచలం ఇంచార్జ్ వెంకటప్పయ్య నిందితుడిని రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, భద్రాచలం ప్రాంతాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. గంజాయి విక్రయదారులు, మధ్యవర్తులు, రవాణాదారులు, వినియోగదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందని, వారి వివరాలు ఇప్పటికే పోలీసుల వద్ద ఉన్నాయని చెప్పారు. త్వరలో ప్రత్యేక దాడులు నిర్వహించి మాదకద్రవ్యాల వ్యాపారంలో పాల్గొంటున్న వారందరినీ చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు.గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

# మొద్దులగూడెం గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



దమ్మపేట జూన్ 17 (వుదయం ప్రతినిధి ):దమ్మపేట, మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను సర్పంచ్ బేతం రుక్మిణి , కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రావు రఘు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, హాస్పిటల్‌లో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. అర్హులైన కుటుంబాలకు నేరుగా సహాయాన్ని అందించడం ద్వారా వారి ఆస్పత్రి ఖర్చులకు ఎంతో కొంత సహాయ పడుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల మంజూరు విషయంలో అశ్వారావుపేట నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని, దీనికి ముఖ్య కారణం స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధ వహించడమేనని పేర్కొన్నారు. పేదల పక్షాన నిలబడే ఇటువంటి నాయకుడు దొరకడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి నాయకుడు ప్రజల గుండెల్లో చిర స్థాయిలో నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి మండలం, బుగ్గపాడు ఫుడ్ పార్క్, సింగరేణి బొగ్గు కుంభకోణం లో అక్రమాలపై సిఐడి విచారణ చేపిస్తామన్న డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి




సత్తుపల్లి జూన్ 17 ( వుదయం ప్రతినిధి ) సత్తుపల్లి మండలం, బుగ్గపాడు ఫుడ్ పార్క్ లో అక్రమాలపై సిఐడి తో విచారణ చేయిస్తామని డా పొంగులేటి సుధాకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

అతి తక్కువ రేటుకే 84 ఎకరాలను ఆంధ్ర కంపెనీకి కట్టబెట్టారని ,చక్రం తిప్పిన స్థానిక నాయకులు

ఫుడ్ పార్క్ యొక్క అసలు ఉద్దేశాన్ని,పర్పసును తుంగలో తొక్కుతున్న అధికార గణంమని అధికార పార్టీ అగ్రశ్రేణి నాయకుల కనుసన్నల్లో భూకుంభకోణం జరిగిందని,కేంద్రం నిధులు వాటా కూడా ఉందని,ఈ భూ కుంభకోణాన్ని వదిలే ప్రసక్తే లేదని, అధికార పార్టీ నాయకులు రైతుల నోట్లో మట్టి కొడుతున్నారనిస్థానిక ప్రజలకు అందాల్సిన ఫలితాలను ఆంధ్ర కు కట్టబెట్టడం దారుణం అన్నారు.ప్రజలు అన్నీ గమనిస్తా ఉన్నారని , అవకాశం వచ్చినప్పుడు కర్రుకాల్చి వాత పెడతారని కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేపిస్తామని ,మీ అవినీతి సామ్రాజ్యాన్ని ప్రజలముందు ఉంచుతామన్నారు.ఇప్పటికైనా మించిపోయింది లేదని భూకుంభకోణాన్ని ఆపండని ,ఏ ఉద్దేశంతో ఫుడ్ పార్క్ ను మొదలు పెట్టారో దానికోసం కృషి చేయండని కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత మేము తీసుకుంటామని తెలిపారు. లేదంటే అమీతుమీ కి బీజేపీ సిద్ధమని బీజేపి జాతీయ నాయకులు, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల సహా ఇంచార్జ్ పొంగిలేటి సుధాకర్ రెడ్డిహెచ్చరించారు. అదేవిధంగా సింగరేణి బొగ్గు కుంభకోణం కేంద్ర సంస్థలతో విచారణ జరిపిస్తామని తెలిపారు.

# దశాబ్దాల సాగు భూములకు హద్దులు నిర్ణయించి హక్కులు కల్పించాలి

**. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య**
**. ఆదివాసీల భూముల్లో బయటి వ్యక్తుల బెదిరింపులు సహించం**
**. మామిడిగుండాల భూ సమస్యపై దశలవారీ ఆందోళనకు సిద్ధం**



ఇల్లందు జూన్ 17 (వుదయం)దశాబ్దాలుగా మామిడిగుండాల ప్రాంతంలో గిరిజన, ఆదివాసీ రైతులు సాగు చేసుకుంటున్న నెమరుగమ్ముల రాఘవేంద్రరావుకు చెందిన సీలింగ్ భూములను వెంటనే సదరు సాగుదారులకే కేటాయించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు.

స్థానిక చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన భవనంలో బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఒక ముఖ్యమైన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల ముఖ్య నేతలు పాల్గొని గిరిజన రైతుల భూ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. మామిడిగుండాల పరిధిలో సుమారు 4,000 ఎకరాలకు పైగా ఉన్న నెమరుగమ్ముల రాఘవేంద్రరావు భూముల్లో గతంలోనే 2,500 ఎకరాలను స్థానిక సాగు రైతులకు పంపిణీ చేశారని గుర్తు చేశారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు రాఘవేంద్రరావు కుటుంబానికి కేటాయించాల్సిన భూమి పోగా, మిగిలిన భూమిని సైతం ప్రస్తుతం సాగులో ఉన్న పేద గిరిజన రైతులకు ఇవ్వాలని తాము అనేక సంవత్సరాలుగా నిరంతర పోరాటాలు చేస్తున్నామని గుమ్మడి నరసయ్య స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఈ భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో సరైన హద్దులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని అఖిలపక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టత లేకపోవడాన్ని కొందరు ఆసరాగా చేసుకుంటున్నారని మండిపడ్డారు.

ఈ భూములు తమవేనంటూ స్థానికంగా ఎటువంటి సంబంధం లేని కొంతమంది బయటి వ్యక్తులు వచ్చి, దశాబ్దాలుగా నమ్ముకుని సాగు చేసుకుంటున్న పేద గిరిజన రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ భూవివాదంపై ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రైతులకు గతంలో ఇచ్చిన భూములకు తక్షణమే సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే సాగులో ఉన్న అర్హులైన గిరిజన, ఆదివాసీలందరికీ పూర్తిస్థాయిలో హక్కుదారు పట్టాలు పంపిణీ చేసి వారికి శాశ్వత భూ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని అఖిలపక్షం స్పష్టం చేసింది. పేద రైతుల భూ హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ విషయమై త్వరలోనే స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, మరియు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అఖిలపక్ష ముఖ్య నాయకులు నబి, భాస్కర్, లక్ష్మయ్య, సంజీవ్, సిలివేరి సత్యనారాయణ, వీరభద్ర, కృష్ణ, రాంబాబు, ఆర్ఎస్ బోస్ తదితరులు పాల్గొని గిరిజనుల పోరాటానికి తమ మద్దతును ప్రకటించారు.